

Author Of Highest Number Of Novels In Telugu

# సూర్యదేవర రామ్ మోహన రావు



# శతపత్ర

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి
100 వ నవలకు చేరువవుతున్న మీ అభిమాన రచయిత
The Number One Best Selling Author

# సూర్యదేవర రామ్మోహనరావు

93వ నవల

# శతపత్ర

మధుప్రియ పబ్లికేషన్స్
మాచవరం • విజయవాడ - 520 004

# SATAPATRA

(Serialised in 'Swathi' Weekly)

By

**SURYADEVARA RAM MOHANA RAO**

Sri Venkata Anantha Sai Nilayam

Flat No.63, Road No.71

Navanirman Colony, Jubilee Hills

Hyderabad - 500 096

E-mail : suryadevaranovelist@gmail.com

www.suryadevararammohanrao.com

www.suryadevaranovelist.com.

Published by :

**MADHU PRIYA PUBLICATIONS**

Machavaram, Vijayawada - 520 004

Phone : 0866 - 2431969

First Edition :

**2013**

Price :

**Rs. 140-00**

Cover Design :

**DURGA RAO**

Printers :

**AKSHARAM OFFSET PRINTERS**

Vijayawada - 2

# శతపత్ర

లండన్! ఒకప్పుడు సూర్యుడస్తమించని బ్రిటీష్ మహా సామ్రాజ్యానికి రాజధానీ నగరం. యూరప్‌లోని పురాతన నగరాల్లో లండన్ ఒకటి. ప్రస్తుతం వలస రాజ్యపాలన అంత మయ్యాక బ్రిటన్‌కి మాత్రమే రాజధానిగా పరిమితమై పోయిందీ నగరం. రెండుసార్లు తగలబడిపోగా పునర్నిర్మించ బడిన నగరం లండన్. యూరప్‌లో ప్లేగువ్యాధి వ్యాపించినపుడు లండన్‌లో వేలాదిమంది ఆ మహమ్మారిబారిన పడి చనిపోయారు.

చరిత్ర ప్రసిద్ధమైన ఎందరో వీరుల్ని, ఎన్నో యుద్ధాల్ని, మరెన్నో ఘోరాల్ని చూసిన నగరం. ఎన్నో ఖండాలు, ఎన్నో దేశాల చరిత్రల్ని, సంస్కృతుల్ని, సంప్రదాయాల్ని, ప్రపంచ అద్భుతాల్ని, వింతల్ని గుప్పిటపట్టి దాచిన నగరం.

వలస రాజ్యాల నుంచి అంతులేని సంపదే కాదు. అమూల్యమైన, అలభ్యమైన గ్రంథాలు కూడా బ్రిటన్‌కు తరలించబడ్డాయి. అందుకే ప్రపంచంలో అనేక భాషలకు చెందిన సాహిత్య, చారిత్రక గ్రంథాలు కూడా ఇప్పటికీ లండన్ లైబ్రరీలో కన్పిస్తాయి. మనలో చాలామంది మన నమ్మకాల్ని మూఢనమ్మకాలనుకుంటారు. పాశ్చాత్యులవి అధునాతన భావాలని, వారిలో మూఢనమ్మకాలుగాని, భయాలుగాని అస్సలు కనిపించవని అనుకుంటారు. నిజానికి మనకన్నా పాశ్చాత్యులకే మూఢనమ్మకాలు ఎక్కువగా ఉంటాయని చాలామందికి తెలియదు.

దయ్యాలు, భూతాలు, భయాలు మనదేశంలో కన్నా అమెరికా, ఆఫ్రికా, యూరప్ దేశాలవారికే ఎక్కువ.

దయ్యాలు, భూతాలు వణికించే వింతజీవుల కథలతో హాలీవుడ్ నిర్మాతలు నిర్మించినన్ని దయ్యాల సినిమాలు మరే దేశంలోనూ నిర్మించ బడలేదు.

మనం బయటికి వెళ్తున్నప్పుడు పిల్లి ఎదురైతే అశుభంగా భావిస్తాం. కొన్ని దేశాల్లో పిల్లి ఎదురైతే శుభశకునంగా భావిస్తారు. పదమూడు సంఖ్య గురించి మనకు ఎలాంటి సెంటిమెంట్లూ లేవు.

కాని ఆ సంఖ్యను చూస్తేనే వణికిపోయేవారున్నారక్కడ. పదమూడు సైతాన్ సంఖ్యగా భావిస్తారు. ఎంత భయమంటే హోటల్‌లో పదమూడు సంఖ్యతో గది ఉండదు. పదమూడు వదిలేసి పధ్నాలుగుతో కంటిన్యూ చేస్తారు.

అలాగే ఇంటి నెంబరు కూడా 13 ఉంచరు. ఆ సంఖ్యని అరిష్టంగా భావిస్తారు.

అయితే ఇదే పదమూడు సంఖ్యను మయన్ నాగరికతకు చెందినవారు చాలా పవిత్రంగా భావిస్తారు. భూమి నుంచి స్వర్గానికి మధ్య పదమూడు లోకాలున్నాయని, ఆ సంఖ్య దేవతల సంఖ్య అని భావించేవారు. మనకి కూడా ఏడు ఏడు పధ్నాలుగు లోకాలున్నాయంటారు. పైన స్వర్గానికి, భూమికి మధ్యన గాంధర్వ, కిన్నెర, కింపురుష, విద్యాధర, యక్ష మొదలైన దైవలోకాలున్నాయని, కింద అతల, వితల, సుతల, పాతాళ, తలాతల మొదలైన ఏడు లోకాలున్నాయని, అవి రాక్షస లోకాలని అంటారు. వామనుడు బలిచక్రవర్తిని పాతాళానికి తొక్కిన పురాణగాథ మనకు తెలిసిందే.

నమ్మకాలు, మూఢనమ్మకాలు, భ్రమలు, నిజాలు ఆయా దేశ కాల పరిస్థితులనుబట్టి వేరువేరుగా ఉంటాయి. ఒకచోట మంచి అనుకునే విషయం

మరోచోట చెడు కావచ్చు. అయితే దయ్యాలు, భూతాల గురించి ప్రపంచ వ్యాప్తంగా అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి.

అమెరికాలోని మెక్సికో ప్రాంతపు అడవుల్లోను, ఆఫ్రికా అడవుల్లోను, మనదేశంలో కేరళ, అస్సాం ప్రాంతాల్లోనూ ఇప్పటికీ గొప్ప గొప్ప మంత్రగాళ్ళున్నారు.

లండన్ నగరం వరకే చూస్తే- అక్కడి హీత్రూ విమానాశ్రయంలో దయ్యాల గురించి అనేక కథలు ప్రచారంలో వున్నాయి. ఎన్నో దశాబ్దాలుగా షేక్స్పియర్ నాటకాల్ని ప్రదర్శిస్తున్న గొప్ప థియేటర్ ఒకటి లండన్‌లో ఉంది. ఆ థియేటర్‌లో ఇప్పటికీ దయ్యాలున్నాయని అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి.

అసలు ఈ దయ్యాలు, భూతాలు ఏమిటి? ఆత్మ ఏమిటి? మనిషి మరణించిన తర్వాత ఆత్మ దయ్యమవుతుందా? మరణానంతరం కూడా ఆత్మకు జీవితం ఉందా? ఉంటే అది ఎలాంటి జీవితం?

ఆత్మ చావు లేనిది. అగ్నితో కాల్చబడదు. కత్తితో చీల్చబడదు. చావు శరీరానికేగాని, ఆత్మకు లేదు అని గీతాచార్యుడు బోధించాడు.

శరీరాన్ని పోగొట్టుకున్న ఆత్మ మరో శరీరం ధరించాలి. అంటే ఆత్మ మరణానంతరం మనిషి కావచ్చు. కుక్క కావచ్చు, నక్క కావచ్చు.

మరో జీవి గర్భాన్ని వెదుక్కుని పోవాలి. గర్భస్థశిశువుగా మారి పునర్జన్మించాలి కాని. మధ్యలో మరో జన్మకు పోకుండా దయ్యాలు, భూతాలుగా మారటం ఏమిటి? అసలు మరణానంతరం ఆత్మ ఏమవుతోంది?

ఈ ఆత్మశోధన ఈనాటిది కాదు. ఏనాటికీ మనిషి మేధస్సుకు అంతుచిక్కని దైవరహస్యమిది.

మనిషి అంతరిక్షంలో అద్భుతాల్ని ఆవిష్కరించగలుగుతున్నాడు. శోధించి ఎన్నో కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటున్నాడు. కాని మన భూమిపైనే అంతు చిక్కని, విచిత్రమైన ఎన్నో మిస్టరీలు దాగి వున్నాయి. వాటిని ఛేదించలేకపోతున్నాడు.

మంగోలియా మహావీరుడు చెంఘిజ్‌ఖాన్ చనిపోయి శతాబ్దాలు గడిచాయి. ఇంతవరకు అతని సమాధిని కనిపెట్టలేకపోయారు. ఆ సమాధిని కనిపెట్టి అందులో దాచిన బంగారాన్ని, వజ్రవైఢూర్యాల్ని కొల్లగొట్టాలని ఇప్పటికీ అన్వేషణ సాగిస్తూనే వున్నారు.

ప్రస్తుతం చెంఘిజ్‌ఖాన్ సమాధిగా చెప్పబడుతున్న చోట ఆ నిధి లేదు. ఇక్కడో విచిత్రం ఉంది. ఆ సమాధి ముందు ఒక శిలా అశ్వం వుంది.

చెంఘిజ్‌ఖాన్ పునర్జన్మించినప్పుడు గుర్తుగా ఆ అశ్వం ముందు కాళ్ళు లేపి బిగ్గరగా సకిలిస్తుందట.

ఈ సూచన ఇంతవరకూ జరగలేదు. కాబట్టి చెంఘిజ్‌ఖాన్ ఇంకా పుట్టలేదనే అనుకోవాలి.

ఇలాంటిదే వీరబ్రహ్మేంద్రస్వామి- యాగంటిలో బసవడు లేచి రంకె వేస్తాడని కాలజ్ఞానంలో రాయటం.

శ్రీకృష్ణుడి ద్వారకానగరం నీటమునిగిన గాథలాంటిదే, ఒకప్పుడు అట్లాంటిక్ సముద్రంలో అట్లాంటిస్ అనే నగరం నీట మునిగిపోయింది.

ఆ నగరాన్ని కనిపెట్టి బంగారం తీయాలని చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటికీ ఫలించలేదు.

బెర్ముడా ట్రయాంగిల్ అనే సముద్రదీవివైపు వెళ్ళిన ఏ నౌకా వెనక్కి తిరిగి రాలేదు. దీవి మీదుగా ఎగిరిన ఏ విమానం కూడా తిరిగి లాండ్ కాలేదు. దీని మిస్టరీ ఏమిటో ఇప్పటికీ కనిపెట్టలేకపోయారు. ఫ్లయింగ్ సాసర్స్ ఇంకా అంతుచిక్కని మిస్టరీగానే వుంది.

లోకంలో ఘనాకార్యాలు చేయటంకోసమే కొందరు పుడతారు. అనుభవంలోకి వస్తేగాని తనలో ఉండే ప్రత్యేకత ఏమిటో కొందరికి అర్థంకాదు.

ఏదో సాహసం చేయాలి, ఏదో సాధించాలని పట్టుదలైతే ఉందిగాని, ఏం సాధించాలో తెలీని స్థితిలో ఒక యువతి అన్వేషణ సాగిస్తోంది.

ప్రపంచంలోని మిస్టరీలను స్టడీచేస్తూ ప్రస్తుతం లండన్‌లోనే వుంది. ఆ యువతి పేరు శతపత్ర.

** * * *

అదేపనిగా కాలింగ్‌బెల్ మోగుతుంటే బిరబిరా వచ్చి తలుపుతీసింది విశ్వదా.

ఎదురుగా శతపత్ర. లేతాకుపచ్చ చక్కటి డిజైన్‌లోని చుడీదార్‌లో చిరునవ్వులు చిందిస్తూ అరవిరిసిన ముద్ద మందారంలా నిలబడి వుంది.

నడుమ్మీద చేతులుంచుకుని కించిత్తు కోపంగా చూసింది విశ్వదా-

"అనుకున్నాను. వీకెండ్ వస్తేగాని ముఖం చూపించవనుకున్నాను. ఇవాళ లైబ్రరీ సెలవుగాబట్టి నేను గుర్తొచ్చాను. అంతేగా?" అనడిగింది సీరియస్‌గా విశ్వదా.

"అంతేగా అంటే... అంతే మరి. నేనేం చెప్పినా నువ్వు నమ్మవుగా..." అంది శతపత్ర.

"నన్ను నమ్మించాలని చూడకు. నీమీద నాకు ఎంత కోపంగా వుందో తెలుసా?" అంది విశ్వదా.

"అది తెలిసే నీకోపం పోగొట్టాలని వచ్చాను. అయినా ఏమిటే ఇది. డోర్‌లో నిలబెట్టే మాట్లాడతావా? లోపలికి రానీయవా?" అంది నవ్వుతూ శతపత్ర.

తల ఊపి చిన్నగా నిట్టూర్చింది విశ్వదా. "రా తల్లీ. లోపలికి రా" అంటూ పక్కకు తప్పుకుంది.

"అంత మర్యాద అక్కర్లేదులే" అంటూ లోపలికి వచ్చింది శతపత్ర. తలుపుమూసి వెనుతిరిగింది విశ్వదా.

"నాకొస్తున్న కోపానికి నిన్నేం చేయాలో తెలీటంలేదే. పదిరోజులైంది నిన్ను చూసి. ఫ్లాట్‌కొస్తేనేమో ఉండవు. ఎప్పుడు చూసినా లైబ్రరీ... లైబ్రరీ. పోనీ లైబ్రరీ కొద్దామంటే అక్కడంతా సైలెన్స్. మాట్లాడుకోడం కుదరదు. ఈ మధ్య మరీ పుస్తకాల పురుగువైపోతున్నావ్. కూచో, కాఫీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది విశ్వదా.

శతపత్ర వయసు పాతికేళ్ళు. అయిదున్నర అడుగుల ఎత్తు. ఆ ఎత్తుకు తగిన అంగసౌష్ఠవం.

అందానికి నిర్వచనం ఈ అమ్మాయేనా అన్పిస్తుంది ఆమెను చూడగానే. అంతటి సౌందర్యవతి. అందం ఒక్కటే కాదు. ఒక విధమైన ఠీవి, దర్పం ఆమెలో కొట్టొచ్చినట్టు కన్పిస్తాయి. ఆచితూచి మాట్లాడటం, ఏ పని చేసినా హుందాగా చేయటం శతపత్ర ప్రత్యేకత.

పద్మదళాయతాక్షి. అంటే తామరపూవు రేకువంటి కనులు కలిగినది అనర్థం.

ఆకర్ణాయతనేత్రి. అంటే చెవులవరకు వ్యాపించిన కనులు కలది అని అర్థం. ఈ రెండు పోలికలు స్త్రీయొక్క విశాలనేత్రాలని తెలియజేస్తాయి.

అటువంటి విశాల నేత్రాలు, విశాలమైన ఫాలభాగం, కోటేరులా తీర్చిదిద్దినట్టుండే చక్కటి ముక్కు. పగడాల వంటి పెదవులు, శంఖంలాంటి మెడ, స్వచ్ఛమైన బంగారంలా మెరిసే మేనిఛాయ... ఇవన్నీ అరుదుగా రాజ వంశ స్త్రీలలో మాత్రమే కన్పించే సోయగం లక్షణాలు.

శతపత్రను చూస్తే ఆమె ఏ రాజవంశానికో చెందిన యువతి అని అపోహపడతారు. అంతగా విలక్షణమైన, అందమైన యువతి శతపత్ర.

ఆమె లండన్ వచ్చి ఆరేళ్ళయింది.

చదువు అయిపోయింది.

అయినా ఇక్కడే ఉంది. ఇండియా తిరిగివెళ్ళలేదు. ఎప్పుడు వెళ్తుందో కూడా తెలీదు. స్నేహితురాలైన విశ్వదాకి కూడా ఆ వివరాలు తెలీదు.

విశ్వదా వయసు కూడా పాతికేళ్ళు.

ఆమె అయిదేళ్ళుగా లండన్‌లో ఉంటోంది. ఆమె చదువు ఇంకా పూర్తికాలేదు. చదువుతోపాటు పార్ట్‌టైమ్ జాబ్ కూడా చేస్తోంది. గొప్ప అందం అని చెప్పలేం.

తన అందాన్ని ఇనుమడింపచేసుకోడానికి మిడ్డీస్, స్కర్ట్సు- ఇలా అక్కడి యువతుల్లాగే డ్రస్ చేసుకుంటుంది. తన అందాల ప్రదర్శనకి ప్రాధాన్యత నిస్తుంది. అలాగని చెడ్డది కాదు. బాయ్‌ఫ్రెండ్స్ లేరు.

డ్రెస్ విషయం విశ్వదాకి పూర్తి వ్యతిరేకి శతపత్ర. ఆమెకు మన సాంప్రదాయ దుస్తులంటేనే ఇష్టం. చీర జాకెట్ ధరించటం మరీ ఇష్టం. సందర్భాన్నిబట్టి చుడీదార్‌లు, జీన్‌ప్యాంట్స్ షర్టులు ధరిస్తుంది. ఒళ్ళు కనబడే దుస్తులు ఆమెకు దూరంగా వుండాల్సిందే.

ఇద్దరూ హైదరాబాదీ యువతులే కావటంతో వారి స్నేహం మరింత గట్టిపడింది. అయితే యిద్దరూ ఎవరి ఫ్లాట్‌లో వాళ్ళుంటున్నారు.

శతపత్ర ఉంటున్న ఫ్లాట్ అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో వుంది. తన బాబాయ్ వాళ్ళ ఫ్యామిలీతో ఉంటోంది. విశ్వదా ఒంటరిగానే ఉంటోంది. విశ్వదా అప్పటికింకా నైటీలోనే వుంది. కిచెన్‌లోంచి రెండు కాఫీ కలిపి తెచ్చి ఒకటి శతపత్రకి ఇస్తూ- "వంద ఆకుల ఒయ్యారీ... తీసుకోవమ్మా కాఫీ" అంది కొంటెగా.

"ఇదిగో... అలా తెలుగులో పిలిస్తే కోపం వస్తుంది. తెలుసుగదా" కాఫీ అందుకుంటూ ఉడుక్కుంది శతపత్ర. "ఎందుకే కోపం. శతపత్ర అంటే వంద ఆకులనేగా అర్థం. నీ మూడ్స్ కూడా వందరకాలుగా ఉంటాయి. అందుకే నేను అలా అన్నాను" అని అంది ఆమె ఎదురుగా కూచుంటూ విశ్వదా.

"సర్లే... అయినా వచ్చీరాగానే నామీద విరుచుకుపడుతున్నావ్! ఏమైంది నీకు?" కాఫీ సిప్ చేస్తూ మధ్యలో అడిగింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1357**

* * *

**Read other books by Suryadevara Rammohana Rao @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=**
**Suryadevara+Rammohana+Rao&id=409**